

జడ్‌ఆర్‌యుసిసి మెంబర్‌గా రవి అగర్వాల్

తాడేపల్లిగూడెం : దక్షిణ మధ్య రైల్వే జోనల్ సలహా మండలి సభ్యునిగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన రవి అగర్వాల్ నియమితులయ్యారు. ఆ మేరకు దక్షిణ మధ్య రైల్వే నియామక ఉత్తర్వులు జారీ చేసింది. వ్యాపార వాణిజ్య అనుభవం ఉన్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా సుదీర్ఘ కాలం సేవలను అందించిన రామచంద్ర అగర్వాల్ కుమారుడు రవి అగర్వాల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ వ్యాపార వాణిజ్య కేంద్రంగా, విద్యా కేంద్రంగా ఉన్న తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషిచేస్తానని రవి అగర్వాల్ తెలిపారు. ఇక్కడి ప్రయాణికులు, వ్యాపార సంస్థల అవసరాల మేరకు మరిన్ని సూపర్ ఫాస్ట్, ఎక్స్ ప్రెస్ రైళ్ల గూడెంలో హాల్ట్ ఏర్పాటు చేసేందుకు, గూడ్స్ రైళ్ల కేటాయింపు కోసం రైల్వే ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తామన్నారు. సహకరించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రైల్వే ఉన్నతాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అల్లూరి స్ఫూర్తితో పోరాటాలు

ఉద్యమాలే ఊపిరిగా సిపిఎం
ప్రజల్లో చైతన్యానికి నిత్య ప్రచారం
దీర్ఘకాలిక ఉద్యమాల ఫలితాలతో శ్రేణుల్లో నూతనోత్సాహం
సమరశీల పోరాటాలతో మున్ముందుకు
3, 4, 5 తేదీల్లో భీమవరంలో సిపిఎం జిల్లా మహాసభ



ప్రజాశక్తి - భీమవరం

ఉద్యమాల రథసారధి సిపిఎం పోరాటాలే ఊపిరిగా ముందుకు సాగింది. దీర్ఘకాలిక ఉద్యమాలు ఫలితాలను ఇవ్వడంతో పార్టీ శ్రేణుల్లోనూ స్ఫూర్తిని నింపాయి. మిలిటెంట్ పోరాటాలతో ముందుకెళ్తూ ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొంటూ ప్రజా పక్షాన నిలిచి పేదల గొంతుకగా నిలిచింది. ఈ మూడేళ్ల కాలంలో సిపిఎం నిర్వహించిన పోరాటాలు అమోఘం. అధికారంలో ఉంటే అందలం, అధికారం లేకుంటే ఇంటికే పరిమితమయ్యే బూర్జువా పార్టీలను చూస్తుంటాం. అయితే అధికారమున్నా, లేకున్నా ప్రజా సమస్యలే నాడిగా, ఉద్యమాలే ఊపిరిగా సిపిఎం పోరాటాలు చేసింది.

ప్రభుత్వాలు, పాలకులు అవలంబిస్తున్న విధానాలతో పచ్చని పశ్చిమగోదావరి జిల్లాలో అభివృద్ధి తీరు నత్తతో పోటీ పడుతోంది. అపారమైన వనరులు, నిక్షేపాలు పుష్కలంగా ఉన్నప్పటికీ వాటిని ఉపయోగించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారు. ఇది కార్మిక, కర్షక జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లతోపాటు సామాన్య ప్రజానీకం అంతా అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమాలే ఊపిరిగా నిరంతరం ప్రజలకు అండగా నిలుస్తున్న సిపిఎం ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు సాగిస్తోంది. ఈ మూడేళ్ల కాలంలో జిల్లాలో సిపిఎం పోరాటాలు విస్తరించాయి. జిల్లావ్యాప్తంగా ప్రజా సమస్యలపై పెద్దఎత్తున ఉద్యమాలు సాగించింది. అనేక సమస్యల పరిష్కారానికి మార్గనిర్దేశకునిగా సిపిఎం ముందుండి ప్రజలకు అందని ద్రాక్షగా ఉన్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు, ఉపాధి కల్పనకు నిర్విరామ కృషి సాగించింది. జిల్లావాసులను పట్టిపీడిస్తున్న కాలుష్య భూతానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు సాగించింది. రైతు, పేద రైతు, కౌలురైతు సమస్యలపై సాగిన ఉద్యమాలకు అండగా నిలిచింది. జిల్లాలో ఆక్వా నుంచి ఆదాయం పొందే ప్రభుత్వాలు ఆక్వా రైతుల సమస్యలను మాత్రం గాలికొదిలేసింది. సీడ్, ఫీడ్ ధరలు తగ్గించాలని, విద్యుత్ రాయితీలను కొనసాగించాలని సాగిన పోరాటాలకు మద్దతుగా నిలిచింది. పేదల ఇళ్లు, ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు అందించకపోవడంతో లబ్ధిదారులు అప్పుల పాలై వడ్డీలు కూడా కట్టలేని పరిస్థితి ఏర్పడింది. అంతేకాక సొంతిల్లు లేక అద్దె ఇళ్లలో తల దాచుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా వేలాది మందితో ఆయా ప్రాంత ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించడంతో ప్రభుత్వం కొంత కదలిక వచ్చింది. వ్యవసాయ కార్మికులకు అండగా నిలిచిన ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో సరైన కేటాయింపులు చేయకపోవడంతో బిజెపి తీరును నిరసిస్తూ పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసరాలు, ఔషధాలు, ఎరువులు, పురుగులమందులు, కూరగాయల ధరల పెరుగుదలను నిరసిస్తూ పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించారు. ప్రజల దైనందిన జీవితంలో కీలకంగా మారిన సెల్‌ఫోన్ రీఛార్జీ ధరల పెంపును నిరసిస్తూ ఆయా సంస్థల దుకాణాల ఎదుట నిరసనలు తెలిపారు. రోడ్లు నిర్మించాలని, కనీసం మరమ్మతులు చేపట్టాలని దఫదఫాలుగా దీక్షలు, ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలు సాగించడమేకాక ఆ రోడ్ల దుస్థితి తెలిసేలా గుంతల్లో నాట్లు వేయడం, నీటిలో పడుకుని నిరసన తెలపడం సిపిఎంకే చెల్లింది. చేతి వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి, మహిళలపై, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించారు. నూతన మద్యం పాలసీ పేరుతో నివాస ప్రాంతాల మధ్య, బడి, గుడి వంటి ప్రాంతాల్లో మద్యం షాపులు నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ మహిళాసంఘాలతో కలిసి ఆందోళనలు చేశారు. దళితపేటల్లోని స్కూళ్లను విలీనం పేరుతో ఎత్తివేయడాన్ని నిరసిస్తూ, యువతకు డిఎస్‌సి, ఉపాధి కల్పన కోసం, ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులు దోపిడీపై జిల్లావ్యాప్తంగా పోరాటాలు సాగించారు. జిల్లాలో ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ కార్మికులు, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు, ర్యాంపుల్లో బంటా కార్మికులు ఉపాధి కోసం ఇసుక సమస్యపై ఆందోళనలు చేశారు. నరసాపురం పట్టణంలో కాలుష్యానికి వ్యతిరేకంగా వందలాది మందితో మున్సిపల్ కార్యాలయ ముట్టడి, తాడేపల్లిగూడెంలో చెత్త సమస్యపై, చెత్త పన్నుకు వ్యతిరేకంగా మున్సిపల్ కార్యాలయం ముట్టడించారు. ఆకివీడులో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా తయారైన రౌడీయిజంపై పెద్దఎత్తున పోరాటాలు సాగించారు. ప్రజలపై విద్యుత్ ఛార్జీల అదనపు భారాలు, స్మార్ట్‌మీటర్లు, అదానీ కంపెనీతో ఒప్పందం, అవినీతిపై వ్యతిరేకంగా సిపిఎం నిర్విరామ పోరాటాలు సాగిస్తోంది. జిల్లాలో దళితులకు శ్మశానవాటికలు, భీమవరం పట్టణంలో డంపింగ్ యార్డ్, ట్రాఫిక్ సమస్యలపై ఆందోళనలు చేపట్టారు. స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, మున్సిపల్, పంచాయతీ వంటి ప్రభుత్వరంగంలో పని చేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగించింది.

3 నుంచి సిపిఎం జిల్లా మహాసభ

చారిత్రాత్మక ప్రాంతమైన భీమవరంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో సిపిఎం జిల్లా మహాసభ జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. మూడో తేదీన అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి ముగింపు సందర్భంగా భీమవరం పట్టణంలో భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించనున్నారు. అదేరోజు భారీ బహిరంగ సభ నిర్వహణకు సన్నాహాలు సాగుతున్నాయి. మహాసభకు ఎంపికైన ప్రతినిధులతోపాటు హాజరయ్యే ప్రజానీకం వేలాది మందితో అల్లూరికి ఘనంగా నివాళులు అర్పించనున్నారు. 4, 5 తేదీల్లో ప్రతినిధుల సభ జరగనుంది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం హాజరు కానున్నారు. ప్రతి మూడేళ్లకోసారి సిపిఎం గ్రామస్థాయి నుంచి అఖిల భారతస్థాయి వరకు మహాసభలు నిర్వహించి, ఈ మూడేళ్ల కాలంలో సాగించిన పోరాటాల కృషిని సమీక్షించుకుని భవిష్యత్తులో చేపట్టే ప్రజా పోరాటాల సన్నద్ధతకు కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన చేయనున్నారు.


కలెక్టరేట్ వద్ద ఆందోళనలో సిపిఎం నేతలు

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

బిసి హాస్టల్‌ను తనిఖీ చేసిన జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ఉండి

ఉండిలోని బిసి బాలుర వసతిగృహాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. వసతిగృహాన్ని క్షుణ్ణంగా పరిశీలించి భోజనశాలను, మరుగుదొడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు చొరవతో వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం అక్కడ చదివే విద్యార్థులకు రాహుల్‌కుమార్‌రెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి

చించినాడ వంతెనకు అల్లూరి పేరు పెట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - నరసాపురం

విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు, చించినాడ వంతెనకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మీరా గ్రంథాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెల్లదొరలను గడగడలాడించిన సీతారామరాజు విగ్రహాన్ని పార్లమెంట్లో ఏర్పాటు చేయాలన్నారు. నత్తనడకన సాగుతున్న నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్ పూర్తి, నరసాపురం-మచిలీపట్నం రైల్వేలైన్ నిర్మాణం, వశిష్ట గోదావరిపై వారధి నిర్మాణం చేపట్టాలన్నారు. దీనికి అవసరమైన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేయాలన్నారు. ఈ నెల 3, 4, 5 తేదీల్లో భీమవరంలో జరగనున్న సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా మహాసభలో జిల్లాలోని పలు సమస్యలను చర్చించి పరిష్కారానికి తీర్మానాలు చేస్తామన్నారు. జిల్లా కాలుష్య కోరల్లో చిక్కుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో కిడ్నీ, కేన్సర్, లివర్ రోగుల సంఖ్య క్రమేపీ పెరుగుతుందన్నారు. జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, మండల కార్యదర్శి జల్లి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బలరాం

అమిత్‌షా రాజీనామా చేయాల్సిందే

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి - పోడూరు

పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సిపిఎం మండల కన్వీనర్ కాకర వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సిపిఎం, మాలమహానాడు ఆధ్వర్యంలో అమిత్‌షా రాజీనామా కోరుతూ నిరసన అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో డిటికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు మండల గౌరవాధ్యక్షులు బుడితి భీమారావు మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలు మన రాజ్యాంగాన్ని, దేశాన్ని కించపర్చేలా ఉన్నాయన్నారు. ఇంకా పిల్లి ప్రసాద్ మాట్లాడారు. నేతలు బూరాబత్తుల వెంకట్రావు, మల్లుల గణపతి, బొంతు శంకరం, మాలమహానాడు నేతలు సరెళ్ల సత్యనారాయణ, తాడిపర్తి కిరణ్, రవికుమార్, వై.రమేష్, ఎం.కృష్ణమూర్తి, దాసి అనిల్‌కుమార్, ఆర్.శేషుబాబు, కె.చైతన్య, కె.శ్రీను, ఎ.రాజేష్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సిపిఎం, మాలమహానాడు నేతలు

కోడి రెడీ



సంక్రాంతికి పందెంరాయుళ్లు సిద్ధం
ఇప్పటికే ఊరువాడా చిన్నపాటి పందేలు ప్రారంభం
పోలీసుల మాటలకు.. చేతలకు పొంతన కరువు
గతేడాది రెండు జిల్లాల్లో 400కుపైగా బరుల్లో పందేల హోరు
గుండాట, మూడు ముక్కలాట షురూ అంటున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సంక్రాంతి పండుగ మూడు రోజులు విచ్చలవిడిగా కోడిపందేలు నిర్వహించేందుకు పందెంరాయుళ్లు ప్రణాళికలతో రెడీ అవుతున్నారు. ఎక్కడికక్కడ బరులు ఏర్పాటు చేయాలి. ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే దానిపై తర్జనభర్జనలు సాగుతున్నాయి. గతానికంటే భిన్నంగా ఈసారి సంక్రాంతి నెల ప్రారంభం నుంచే రెండు జిల్లాల్లో నూ కోడిపందేలు జోరు సాగుతోంది. ప్రతిరోజూ అనేక నియోజక వర్గాల్లో విచ్చలవిడిగా కోడిపందేలు సాగుతున్నాయి. భీమవరం, ఉండి నియోజకవర్గాలతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ పందేల జోరు పెద్దఎత్తున సాగుతోంది. ఏలూరు జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకొంది. తూతూమంత్రంగా దాడులు నిర్వహించడం తప్ప కోడి పందేలను అరికట్టడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికే రెచ్చిపోయి పందేలు నిర్వహిస్తున్న పందెంరాయుళ్లు పండుగ మూడు రోజులూ అడ్డూఅదుపు లేకుండా పందేలు నిర్వహించాలనే యోచనలో ఉన్నారు. పందేలకు అడ్డుకట్ట వేస్తామంటూ పోలీసులు ఎప్పటిలానే బీరాలు పలుకుతున్న పరిస్థితి ఉంది. పండుగ మూడు రోజులు జిల్లాలో జరిగే కోడిపందేలతో ఎన్నో సామాన్య కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. అయినప్పటికీ సంప్రదాయం పేరుతో ప్రభుత్వం అనధికారికంగా కోడి పందేలకు అనుమతులిస్తూ జూద క్రీడను ప్రోత్సహిస్తూనే ఉంది. కోడి పందేలను అడ్డుకోవాలంటూ న్యాయస్థానాలు స్పష్టమైన తీర్పులిచ్చినా పట్టించుకోని పరిస్థితి ఉంది. కొంతమందిపై బైండోవర్ కేసులు, ఒకటి, రెండు చోట్ల దాడులు నిర్వహించి కోర్టులను సైతం అధికారులు తప్పుదోవ పట్టిస్తున్న పరిస్థితి ఉంది. దీంతో ఈ ఏడాదిసైతం పెద్దఎత్తున కోడిపందేలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ సాగుతున్నాయి. పందెంరాయుళ్లంతా తమ కోళ్లకు తర్ఫీదునిస్తూ పందేలకు సిద్ధం చేస్తున్నారు. జీడిపప్పు, పిస్తా వంటి బలవర్ధకమైన ఆహారం పందెం కోళ్లకు పెడుతున్నారు. రూ.వేలు, లక్షలు చెల్లించి పందెం పుంజులను కొనుగోలు చేస్తున్నారు.

ప్రతియేటా రూ.కోట్లలో పందేల జోరు

ప్రతియేటా పండుగ మూడు రోజులు రెండు జిల్లాల్లో చిన్నా, చితకా దాదాపు 400 బరుల్లో కోడిపందేలు సాగుతున్నాయి. భీమవరం చుట్టుపక్కల, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, దెందులూరు, జంగారెడ్డిగూడెం వంటి పలు ప్రాంతాల్లో భారీఎత్తున కోడిపందేలు సాగుతాయి. ఒక్కో పందేనికి రూ.లక్షల్లో బెట్టింగులు సాగుతాయి. పండుగ మూడు రోజుల్లో రెండు జిల్లాల్లో రూ.200 కోట్లు మేర బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు అంచనా. ఈ ఏడాది అంతకు మించి పందేలు జోరు సాగే అవకాశం ఉందని పందెంరాయుళ్లు అంచనా వేస్తున్నారు. బరుల వద్ద పార్కింగ్ స్థలాలు, టెంట్లు వంటి ఏర్పాట్లపై నిర్వాహకులు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నారు. బరుల వద్ద మద్యం అమ్మకాలు, మూడు ముక్కలాట, గుండాట వంటివి సైతం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కోడిపందేల విష సంస్కృతి ఏయేటికాయేడు పెరుగుతుందే తప్ప ఏమాత్రం తగ్గడం లేదు. ఎంఎల్‌ఎ, మాజీ ఎంఎల్‌ఎలు, మంత్రులు సైతం ఈ పందేల్లో పాల్గొనడంతో పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. కోడి పందేలను అరికట్టేందుకు తహశీల్దార్, ఎస్‌ఐ ఆధ్వర్యంలో మండల కమిటీలను నియమిస్తున్నా ఏమాత్రం ప్రయోజనం లేకుండాపోతుంది. పండుగకు ముందు కోడి పందేలను అరికడతామని పోలీసులు హడావుడి చేయడం, ఆ మూడు రోజులూ చేతులెత్తేయడం పరిపాటిగా మారింది. ఈ ఏడాదైనా కోడి పందేలను అడ్డుకోవాలని జనం ప్రభుత్వాన్ని కోరుతున్నారు

విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలి

ప్రజాశక్తి - ఆచంట

విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదవడం వల్ల ఒత్తిడిని అధిగమించి, మంచి మార్కులతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా కెరీర్ గైడెన్స్ కమిటీ ఛైర్‌పర్సన్ డాక్టర్ కోడూరి రాధా పుష్పవతి అన్నారు. ఆచంట మానవతా యూనిట్ ఆధ్వర్యంలో ఆచంట, ఆచంట వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవడం, ఒత్తిడిని అధిగమించి మంచి మార్కులు సాధించడంతో పాటు లక్ష్య నిర్దేశం గురించి పెద్దలు, ఉపాధ్యాయులతో ఎలా మెలగాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కెరీర్ గైడెన్స్ కమిటీ డైరెక్టర్ ఎక్కల వీర భారతి, కలాగ శారదా దేవి, మండల మానవతా అధ్యక్షులు కుక్కల లీలా ప్రసాద్, ట్రెజరర్ తమ్మినీడి సత్యనారాయణ మూర్తి, ఆనంద్ కుమార్, శర్మ, స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు మెమొంటో అందజేస్తున్న మానవత సభ్యులు

రుణాల మంజూరులో రైతులకు ప్రాధాన్యత

తణుకు రూరల్ : వ్యాపారులకే కాకుండా రైతులకి, ఖాతాదారులకు అవసరమైన రుణాలు మంజూరు చేయడంలో తమ శాఖ ముందు ఉంటుందని బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ బ్రాంచ్ మేనేజర్ అన్నారు. బుధవారం బ్యాంక్ 28వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించి మాట్లాడుతూ ఖాతాదారులకు సత్వర సేవలు అందించడంలో భాగంగా బంగారంపై రుణాలు సులభంగా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - భీమవరం



పశ్చిమగోదావరి జిల్లా ప్రజలకి, ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింటు కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ల ఛాంబర్లలో నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్‌డిఒలు, తహశీల్దార్‌లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, అనధికారులు జిల్లా కలెక్టర్, జాయింటు కలెక్టర్‌లను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, అక్షర కార్యక్రమం స్ఫూర్తిగా పెన్నులు, పుస్తకాలు, విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులను అందజేశారు. అదేవిధంగా వచ్చిన వారందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలను తెలిపి అక్షర కార్యక్రమం పిలుపుకు స్పందించడం పట్ల జిల్లా కలెక్టర్, జిల్లా జాయింటు కలెక్టర్‌లు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సరం వేళ అందరి కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరియాలని, ఆరోగ్యంతో వర్ధిల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి యం.వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒలు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఖతీబ్ కౌసర్ భానో పాల్గొన్నారు.


పాలకొల్లు : పాలకొల్లులో నూతన సంవత్సరం సందర్భంగా వివిధ నేతలు, అధికారుల ఇళ్ల వద్ద బుధవారం సందడి నెలకొంది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వేడుకలకు దూరంగా ఉన్నారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ కూడా ఇంటి వద్ద కొద్ది సేపు మాత్రం ఉండటంతో అధికారులు, పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. దీంతో వైసిపి నేతలు మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జి, గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, గుడాల గోపి కార్యాలయం వద్ద సందడి నెలకొంది. మున్సిపల్ కమిషనర్ కార్యాలయం, తహశీల్దార్, పోలీస్ స్టేషన్‌ల వద్ద కింది ఉద్యోగులు అధికారులకు శుభాకాంక్షలు తెలపడంతో పట్టణంలో సందడి నెలకొంది. ఇదిలా ఉండగా గత రాత్రి పట్టణంలోని మాంసాహార రెస్టారెంట్లలో అమ్మకాలు బాగున్నాయని తెలిసింది. ప్రత్యేక ప్యాకేజీలు పెట్టడంతో అమ్మకాలు పెరిగాయని చెబుతున్నారు.

భీమవరం టౌన్ : 2025 నూతన సంవత్సర వేడుకలు భీమవరంలో పట్టణ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా రాజకీయ నాయకులు నివాసాలైతే నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులతో సందడిగా మారాయి. భీమవరం ఎంఎల్ఎ అంజిబాబు స్థానిక బ్యాంక్ కాలనీలోని కాపు కళ్యాణంలో ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేశారు. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలు బొకేలతో మండల నాయకులు, సర్పంచులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొత్తూరి బాపిరాజు, కాంట్రాక్టర్ పళ్ల ఏసుబాబు, ఇరుంకి సూర్రావు, రాయలం హరి, గౌతమ్ శుభాకాంక్షలు చెప్పి కార్యకర్తలకు విందు ఏర్పాటు చేశారు. జనసేన, టిడిపి, బిజెపి నాయకులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. నరసాపురం ఎంపీ, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆయన కార్యాలయంలో పార్లమెంట్ పరిధిలో ఉన్న రాజకీయ నాయకులు, అధికారులు, పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. అక్కడ కార్యకర్తల కోసం మంచి విందు ఏర్పాటు చేశారు. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషన్ రాజు నివాసంలో నాయకులు, కార్యకర్తలు సందడి చేశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ నివాసంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయడంతో అభిమానులు తరలి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చినిమిల్లి నాగన్న, బాబి, లక్ష్మణరావు పాల్గొన్నారు. నివాసం వద్ద విందు ఏర్పాటు చేశారు. జనసేన జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు(చినబాబు) నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఆయన్ని కలిసి పూల బొకేలతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల నాగేశ్వరరావు నివాసంలో ఆయన కలిసి పూల బొకేలతో ఆయనకు పలువురు రాజకీయ పార్టీ నాయకులు శుభాకాంక్షలు చెప్పారు. జనసేన జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ కార్యాలయంలో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


భీమవరం టౌన్ : ఎంఎల్ఎ అంజిబాబుకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న గ్రేడ్ వన్ కాంట్రాక్టర్ ఏసుబాబు

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ సోదరులు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాత్రి నుండి ప్రత్యేక ప్రార్థనలు చేసి, కేకులు కోసి ప్రజలకు అందించారు. మొగల్తూరులోని ఆర్‌సిఎం చర్చ్, ప్యారిస్ 1 చర్చ్, లోధరన్ చర్చిలలో ఆయా చర్చిల ఫాదర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

ఆచంట : ఆచంట నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో తాడేపల్లిగూడెం మాజీ మంత్రి రంగనాథరాజు ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలు ఘనంగాగ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథరాజును గజమాలతో ఘనంగా సన్మానించి, పూల బొకేలు అందజేశారు. ఈ సందర్భంగా రంగనాథరాజు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నాయకులకు, కార్యకర్తలకు అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడానికి ప్రతిఒక్కరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సుంకర సీతారాం, కోట వెంకటేశ్వరరావు, జక్కం శెట్టి చంటి, ముత్యాల నాగేశ్వరరావు, రుద్ర ప్రసాద్, కార్యకర్తలు అధిక సంఖ్యలో వచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


నరసాపురం : కొవ్వలికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దాసిరాజు

తాడేపల్లిగూడెం : ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్‌కు కూటమి నాయకులు, అధికారులు, అభిమానులు బుధవారం ఆయన నివాసానికి చేరి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలతో ఉండాలని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని వివిధ పార్టీల నాయకుల ఇళ్లకు ఆయా పార్టీ కార్యకర్తలు, అభిమానులు బుధవారం క్యూ కట్టారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, వైసిపి రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డీ రఘురాం నాయుడు, టిడిపి ఇన్‌ఛార్జి వలవల బాజ్జీ, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దీంతో నాయకుల ఇళ్ల వద్ద సందడి నెలకొంది.

నరసాపురం : న్యూఇయర్ వేడుకల్ని ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని అధికారుల కార్యాలయాలు, నేతల ఇళ్ల వద్ద ఉదయం నుంచి సందడి నెలకొంది. ఆర్‌డిఒ, ఇరిగేషన్, వ్యవసాయ, విద్యుత్, మున్సిపల్ తదితర అధికారులకు శుభాకాంక్షలు తెలిపేందుకు సిబ్బంది తరలివచ్చారు. ఇటు ప్రభుత్వ విప్ నాయకర్, కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ(చిన్నా) కార్యాలయాల వద్ద సందడి కనిపించింది. నియోజకవర్గం నుంచి నాయకులు, పెద్ద ఎత్తున తరలివచ్చారు. మధ్యాహ్నం వరకు ఇదే సందడి కొనసాగింది. మాజీమంత్రి, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడుకి ఆర్‌డిఒ దాసిరాజు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.




నోటు పుస్తకాలు అందిస్తున్న విప్, ఎంఎల్ఎ నాయకర్

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

నియోజకవర్గ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో అభిమానులు, కూటమి నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఆయన కేకు కోసి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆయనను కలవడానికి వచ్చే వారు పుష్ప గుచ్ఛాలు తీసుకు రావద్దని ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలు అధిక సంఖ్యలో పుస్తకాలు తీసుకువచ్చారు. వాటిని పేద విద్యార్థులకు పంపిణీ చేశారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

ఎస్‌టిలు ఆర్థికంగా బలోపేతం కావాలి

ఎపి ఎస్‌టి గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎస్‌టిలు అనధికాలంగా ఇటు రాజకీయంగాను, ఆర్థికంగానూ వెనకబడి ఉన్నారని ఎపి ఎస్‌టి గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సింగం సుబ్బారావు పేర్కొన్నారు. మండలంలోని మెట్ట ఉప్పరగూడెంలో బుధవారం నిర్వహించిన ఎస్‌టి గిరిజన కుటుంబాల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎస్‌టిలకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నా సరైన చదువు లేక కుటుంబాలన్నీ వెనకబడి ఉంటున్నాయని, ముందుకు ఒకటి, రెండు కుటుంబాలు తప్ప మిగిలిన అందరూ కూడా దుర్భర జీవితాన్ని గడుపుతున్నారన్నారు. ఈ సందర్భంగా మండలంలోని కడియద్ద, మెట్టొప్పరగూడెం, దండగర్ర, జగన్నాథపురం, మాధవరం, అప్పారావుపేట గ్రామాల్లోని ఎస్‌టి కుటుంబాలకు సంక్షేమ సంఘం తరపున బట్టలు అందించారు. ఈ సందర్భంగా ఎపి ఎస్‌టి గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సింగం సుబ్బారావును సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. నాయకులు మాట్లాడుతూ తమకు ఏ ఆపద వచ్చినా, అవసరం వచ్చినా అండగా నిలిచే సుబ్బారావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎస్‌టి గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సింగం సుబ్బారావు, మెట్ట ఉప్పరగూడెం ప్రెసిడెంట్ చనమర్తి దుర్గారావు, మాధవరం ప్రెసిడెంట్ చనమర్తి శ్రీను, జగన్నాథపురం ప్రెసిడెంట్ ఎర్రసాని శ్రీను, కడియద్ద ప్రెసిడెంట్ దుర్గారావు, పెద్దిరాజు పండు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఉండి

పాములపర్రు నుంచి ఉండి వైపు వచ్చే మురుగు కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం బుధవారం లభించినట్లు ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా తెలిపారు. మహిళకు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసు ఉంటుందని, గుర్తుపట్టని విధంగా ఉందన్నారు. ఎవరైనా తమ వారు కనపడకపోతే వెంటనే ఉండి పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

నలుగురుకి గాయాలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఎదురెదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొని నలుగురు వ్యక్తులు గాయపడిన సంఘటన ఇరగవరం మండలం ఐతంపూడి వద్ద రైస్‌మిల్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే పెనుగొండ మండలం వడలి గ్రామానికి చెందిన జల్లి దుర్గారావు, రాయి వెంకటేష్ గోటేరులోని చర్చికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వడలి వస్తున్నారు. ఆక్రమంలోనే ఓగిడి గ్రామానికి చెందిన పెన్నాడ కిరణ్ బాబు, పెన్నాడ సుధీర్ బాబు పెనుగొండలో సంతకు వెళ్లి ద్విచక్ర వాహనంపై ఓగిడి వస్తుండగా అయితంపూడి వద్ద ఆటోను ఓవర్టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. క్షతగాత్రులను 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో జల్లి దుర్గారావు, పెన్నాడ కిరణ్ బాబు తీవ్రంగా గాయపడ్డారు. పెన్నాడ సుధీర్ బాబు, రాయి వెంకటేష్‌లు స్వల్పగాయలతో బయటపడ్డట్టు బంధువులు చెబుతున్నారు. జల్లి దుర్గారావు తలకి తీవ్రగాయం కావడంతో రాజమండ్రి బొలినేని ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఇరగవరం పోలీసులు తెలిపారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండి

ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయి వ్యక్తి మృతిచెందిన సంఘటన ఉండి మండలం చెరుకువాడలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. చెరుకువాడ గ్రామానికి చెందిన కూర్మ పెద్దిరాజు(43) చెరువులలో తామరాకులను తీసి, వాటిని మాంసం దుకాణాలకు సరఫరా చేసి జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం సాయంత్రం కాపులపేటలోని మంచినీటి చెరువులో ట్యూబ్ వేసుకుని దిగి తామరాకులు తీస్తుండగా ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయి ఊపిరాడక చనిపోయాడని, పెద్దిరాజుకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారని అన్నారు. పెద్దిరాజు భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన గాది కాశి(34) బుధవారం పంపనవారి పాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు అత్తిలిలో ఉన్న తన స్నేహితుల వద్దకు వెళ్లి వాళ్లతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకొని తిరిగి వస్తుండగా పంపన వారి పాలెం మంచిలికి మధ్యలో ఉన్న పుంతలో ముసలమ్మ గుడి దగ్గరలో ఈ ఘటన జరిగింది. అతను ఆకస్మాత్తుగా మోటార్ సైకిల్‌పై నుండి పడిపోవడంతో తలకి గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే స్పందించిన అతని స్నేహితులు పెనుమంట్ర 108 అత్యవసర వాహనానికి సమాచారం అందించగా సమాచారం అందుకున్న సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. యువకుని నుదుటి భాగంలో గాయమై ఉండడంతో పాటు మద్యం మత్తులో ఉండడంతో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ బాలకృష్ణ, పైలెట్ బ్రహ్మాజీ సహకారంతో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం వారి బంధువుల కోరిక మేరకు బ్రాహ్మణ చెరువులోని ప్రయివేట్ హాస్పటల్‌కి తరలించారు.

ఊరికి.. ఉపకారి డాక్టర్ వెంకటరామరాజు

రూ.1.20 కోట్లతో ట్రస్ట్ ద్వారా సేవలు

ప్రజాశక్తి - కాళ్ల

ఏ మనిషికైనా తన చేతైన సేవ చేసి జన్మనిచ్చిన గడ్డ రుణం తీర్చుకోవాలని ఉంటుంది. సమాజంలో ధనవంతులు ఉంటారు. అందులో మనసున్న మహారాజులే అరుదైన శ్రీమంతులుగా పేరొందుతారు. పుట్టిన ఊరు అభివృద్ధి కోసం తనకున్నంతలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న డాక్టర్ దాట్ల వెంకటరామరాజు శ్రీమంతునిగా పేరొందారు. జన్మభూమిపై మమకారంతో మూడు సంవత్సరాలుగా కాళ్లకూరు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవలందిస్తున్నారు. జనం మెచ్చే సేవలు చేస్తూ జన్మభూమి రుణం తీర్చుకుంటున్నారు. రైతు కుటుంబంలో పుట్టి స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగారు. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. పుట్టిన గడ్డను మరువలేదు. సొంత లాభం కొంత మానుకొని అన్నట్లు కోట్ల రూపాయలు ట్రస్ట్ ద్వారా వెచ్చించి పలు అభివృద్ధి, సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నారు.

డాక్టర్ దాట్ల వెంకటరామరాజుకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె వివాహం చేశారు. చిన్నకుమార్తె దాట్ల శ్రీదేవి ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన తల్లి వరలక్ష్మి అనారోగ్యంతో 2019లో మృతి చెందారు. కాళ్లకూరు గ్రామంలో ఆయన తల్లి వరలక్ష్మిని దహనం చేయడానికి మోక్షధామం చేరుకున్నారు. అదే సమయంలో రెండు గంటలపాటు జోరు వర్షం కురిసింది. మోక్షధామం లోతట్టుగా ఉండడంతో వర్షపు నీటితో మునిగిపోయింది. దహనం చేయడానికి అనేక అవస్థలు పడాల్సి వచ్చింది. గ్రామంలో ఎంతోమంది ఉన్నత స్థితిలో ఉన్న మోక్షధామం పరిస్థితి చూసి రామరాజు మనసు బాధించింది. మోక్షధామాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన వచ్చింది. రెండవ కుమార్తె దాట్ల శ్రీదేవి ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతుండగా అపార్ట్‌మెంట్‌పై దుస్తులు తీగపై వేస్తుండగా కాలు జారి కింద పడిపోయి అక్కడికక్కడే మృతిచెందారు. 2021 ఫిబ్రవరిలో కుమార్తె అకస్మికంగా మృతి చెందడంతో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ పేరుతో 2021 ఏప్రిల్‌లో ఏర్పాటు చేశారు. 2021 మే నుంచి దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ సేవలు ప్రారంభమయ్యాయి

గత మూడేళ్లుగా ట్రస్ట్ ద్వారా..

సొంత నిధులు రూ.కోటి 20 లక్షలతో ఇప్పటి వరకు తరాలు మారినా ఇంత సేవ చేసిన నాయకుడు లేడని కాళ్లకూరు ప్రజల మాట. ఔదార్యం, దాతృత్వంతో సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నారు. కాళ్లకూరు మేజర్ పంచాయతీలో సొంత గ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశంతో, గ్రామస్తులకు మంచి కార్యక్రమాలు చేయాలనే ధృక్పథంతో పని చేస్తున్నారు. తన కుమార్తె ఆకాల మరణం చెందడంతో 2021లో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి కాళ్లకూరు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, పలు సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు, గ్రామం ఆహ్లాదకరంగా మార్చడానికి తమ వంతు కృషి చేస్తున్నారు.

కుమార్తె జ్ఞాపకార్థంగా ట్రస్ట్ ఏర్పాటు..


తొలినుంచీ కన్నవారన్నా, జన్మభూమి అన్నా ఎనలేని అభిమానం. కుమార్తెపై ప్రేమతో, జన్మభూమి మమకారంతోనే పుట్టినగడ్డకు మేలు చేయాలనే సదాశయంతో కాళ్లకూరు గ్రామం వచ్చి స్వలాభం కోసం కాకుండా ప్రజా సేవే లక్ష్యంగా ట్రస్ట్ సేవలు అందించడం ద్వారా ఎంతో మంది పేదలకు మేలు చేసిన వారవుతున్నారు. ఒక్క విద్యారంగంలోనే కాకుండా ఆరోగ్య, సేవా కార్యక్రమాలు కూడా చేపట్టడం ద్వారా పేదలకు వైద్యసేవలు అందుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనూ సేవా కార్యక్రమాలు పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. ప్రజల సేవే పరమావధిగా పనిచేస్తూ సేవలందిస్తున్నారు. గ్రామంలో పేద కుటుంబంలో ఎవరైనా మరణించినప్పుడు తన వంతుగా ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. దహన సంస్కారానికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. పేదవారు దహన సంస్కారాలు చేయలేని స్థితిలో ఉన్న కుటుంబాలకు దహన సంస్కారాలకు ఏర్పాటు చేయించి, దానికి సంబంధించిన ఆర్థికసాయం చేస్తున్నారు. పేద కుటుంబంలో జరిగే వివాహానికి ఆర్థిక సహాయం రూ.5 వేలు అందిస్తున్నారు. దాతృత్వ, అన్నదాన కార్యక్రమాల్లో వెంకట రామరాజు వికలాంగులకు వీల్ చైర్లు వంటి సేవలు అందిస్తున్నారు.



ట్రస్ట్ ద్వారా నిర్మించిన ఉచిత ఆర్వో ప్లాంట్

మరింత అభివృద్ధి, పలు సేవా కార్యక్రమాలు..

డాక్టర్ దాట్ల వెంకటరామరాజు, శ్రీదేవి ట్రస్ట్ అధినేత, కాళ్లకూరు



పుట్టిన గడ్డ అభివృద్ధికి పేద ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు దాట్ల శ్రీదేవి జ్ఞాపకార్థంగా నిర్వహిస్తున్నా. ఇప్పటి వరకు రూ.కోటి 20 లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు, వివిధ పండుగలకు అన్నదానం చేయడం, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, కంటి వైద్యం కోసం ఆర్థిక సాయం చేస్తున్నా. ఉచిత కంటి, దంత మెగా వైద్య శిబిరాలను నిర్వహించాం. ఉచిత కళ్లజోళ్లను పంపిణీ చేశా. ప్రతి సంక్రాంతి పండుగ సందర్భంగా 50 నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తా. పేదలకు ట్రస్ట్ ద్వారా మరింత సేవలందిస్తున్నాం.

పలు అభివృద్ధి పనులు..

దాట్ల రామకృష్ణంరాజు, వరలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థంగా దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా మోక్షధామం, వెంకటేశ్వర-పద్మావతి మంచినీటి చెరువు అభివృద్ధి, పలు రేవుల నిర్మాణ పనులను ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామ ప్రజలు విపత్కర సమయంలో కర్మకాండలు జరుపుకునేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ట్రస్ట్ ద్వారా కల్పించారు. నాలుగు దహన గదుల షెడ్లులు, రెండు రేవులు, మూడు వైపులా ఇనుప వైరుతో పెన్సింగ్, ఆహ్లాదాన్ని ఇచ్చేలా మొక్కలను కూడా నాటారు. వాటన్నింటినీ ఏర్పాటు చేసేందుకు ట్రస్టు ద్వారా సుమారు రూ.30 లక్షలు చేపట్టారు.

గౌరవ డాక్టరేట్..

గ్రామంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ పేద ప్రజలకు విశేష సేవలు, ప్రజలకు ఉపయోగపడే మంచి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవలను బెంగుళూరుకు చెందిన ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గుర్తించింది. ఆ విశిష్ట సేవలకు గుర్తుగా బెంగుళూరుకు చెందిన ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ 2023 ఏప్రిల్‌లో గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ట్రస్టు ద్వారా పేద ప్రజలకు, పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం, ప్రతి వేసవిలో చలివేంద్రం, మోక్షధామం వివిధ అభివృద్ధి, వివిధ స్వచ్ఛంద సేవలు చేసినందుకు ఈ డాక్టరేట్ వరించింది. తన అలుపెరగని కృషి, కఠోర శ్రమ వల్లే ఈ ఘనత సాధించాడు.

ఉచిత ఆర్వో వాటర్ ప్లాంట్..

కాళ్లకూరు గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి నెల నుంచి గ్రామ ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. 1200 మంచినీటి క్యాన్లు ఉచితంగా అందించి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటికి నీటిని అందిస్తున్నారు.

పలు పండుగలకు అన్నదానం..

అన్ని దానాల్లో కల్లా అన్నదానం మిన్న అన్న నానుడిని రామరాజు గుర్తించుకొని ప్రతి ఏటా మేరీమాత ఉత్సవాలు, వినాయక చవితి, సంక్రాంతి, శివరాత్రి పండుగలకు తమకు తోచిన రీతిలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో పార్వతి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా మొదటి సోమవారం ట్రస్టు ద్వారా వేలాది మందికి కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్మలమాత పున: నిర్మాణ మందిరాన్ని ట్రస్టు ద్వారా రూ.4.50 లక్షలతో నిర్మించిన దానిని డాక్టర్ దాట్ల వెంకట రామరాజు ప్రారంభించారు. కాళ్లకూరు వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన భవన నిర్మాణానికి రూ.1,01,116 విరాళాన్ని అందించారు.

ఉచిత కళ్లజోళ్ల పంపిణీ..

కాళ్లకూరు గ్రామంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఎల్‌వి.ప్రసాద్ ఆకివీడు ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఉండి ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణంరాజు ప్రారంభించారు. ఉచిత కంటి దంత మెగా వైద్య శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 150 మంది ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 23 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు.

3న సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తణుకు


ఈనెల 3వ తేదీన భీమవరంలో జరిగే సిపిఎం 26వ జిల్లా మహాసభలు, బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక అమర వీరుల భవనంలో సిపిఎం సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రతాప్ మాట్లాడుతూ సిపిఎం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామ, వార్డు స్థాయి నుంచి ఆల్ ఇండియా వరకు మహాసభలు నిర్వహిస్తుందన్నారు. గడిచిన కాలంలో ప్రజలు సమస్యలపై చేసిన పోరాటాలు ఫలితాలపై సమీక్షలు చేయడం జరుగుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం ప్రజల సంక్షేమం తప్ప అభివృద్ధి పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వం వివిధ రూపాలలో పెద్దఎత్తున భారాలు వేయడం వల్లనే ఘోరంగా ఓటమి చెందిందన్నారు. నేడు అధికారంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పుడే మళ్లీ కొత్తదారిలో భారాలు వేయడం అన్యాయం అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 3, 4, 5 తేదీలలో జరిగే మహాసభలకు రాష్ట్ర నాయకులు హాజరు అవుతారని తెలిపారు. ఈ మహాసభలలో జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్తు పోరాటాలు రూపకల్పన చేయడం జరుగుతుందని తెలియజేశారు. బహిరంగ సభ భీమవరం బస్టాండ్ నుంచి ప్రకాశం చౌక్ వరకు ర్యాలీ అనంతరం సభ మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ ప్రచురించిన కరపత్రం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయ కుమారి, గుబ్బల గోపి, కె.నాగరత్నం, వెంకటేశ్వరరావు, ఎన్ఎ.బాబు పాల్గొన్నారు.

గణపవరం : ఈనెల 3, 4, 5 తేదీలలో భీమవరంలో జరిగే సిపిఎం 26వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం కేశవరం ఉద్ధరాజు రామం నగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, గణపవరం మండల కార్యదర్శి పెచ్చేట్టి నరశింహమూర్తి మాట్లాడుతూ జిల్లా మహాసభల సందర్భంగా మూడవ తేదీన భీమవరం పురవీధుల్లో ప్రజాప్రదర్శన, అనంతరం ప్రకాశం చౌక సెంటర్లో బహిరంగ సభ జరుగుతుందని అన్నారు. ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాలుగు, ఐదు తేదీలలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్లో ప్రతినిధుల సభ జరుగుతుందని చెప్పారు. ఈ మహాసభలో గత మూడేళ్ల జరిగిన ప్రజా ఉద్యమాలను సమీక్షించి, రానున్న రోజుల్లో నిర్వహించబోయే కర్తవ్యాలను రూపుదించటం జరుగుతుందని అన్నారు. ప్రజాసమస్యలపై సిపిఎం నిర్వహించే ప్రజా పోరాటాలకు సహకరించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు నరాలశెట్టి రామకృష్ణ, సోడదాసి సంజీవిరావు, పెచ్చేట్టి లక్ష్మీ, ఎర్రసాని సాయి, కావాడి బోగమ్మ, గుబ్బల వీర్రాజు, కడలి వరలక్ష్మీ, జల్లి నరసమ్మ, పంపన వెంకటలక్ష్మీ, మామిడి శెట్టి తాతరావు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - కాళ్ల

విద్యార్థులకు బైబిల్ జ్ఞానాన్ని పెంపొందించేందుకు క్విజ్ పోటీలు నిర్వహించామని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ పశ్చిమగోదావరి అధ్యక్షులు సోడదాసి జాకబ్ రాజు అన్నారు. కలవపూడి గ్రామంలో సిబిసిఎన్‌సి చర్చిలో నూతన సంవత్సరం సందర్భంగా బైబిల్ క్విజ్ పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు బుధవారం అందజేశారు. మొదటి బహుమతి ఎన్.కవితకు రూ.2 వేలు, 2వ బహుమతి బి.శ్రావ్యకి రూ.1500, 3వ బహుమతి కె.హెూలీ ప్రీతికి రూ.1000, క్విజ్‌లో పాల్గొన్న 15 మందికి స్పెషల్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బి.బెంజ్‌మేన్, స్థానిక సిఆర్‌యు.జయసుందరం, సంఘ పెద్దలు జి.రమేష్, పి.రాజరావు, స్త్రీల సమాజం, సంఘస్తులు, సండే స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.



ఎంపికైన వాసవి క్లబ్ నూతన కమిటీ

వాసవీ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని అప్పన్నప్లాజాలో వాసవిక్లబ్ నూతన కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. దీనికి జిల్లా గవర్నర్ సిహెచ్‌ఎన్‌వి ఎస్ఎస్ ప్రసాద్ అధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులుగా నూలి వెంకట నారాయణ రావు(నూలి శ్రీను), కార్యదర్శి కంచర్ల మురళీకృష్ణ, కోశాధికారిగా కోట్ల బాలకృష్ణలు ఎన్నికయ్యారు. వీరిచేత ప్రమాణస్వీకారం చేయించారు. ఇంటర్నేషనల్ పాస్ట్ ఆధ్యక్షులు నూలి వెంకట రమణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి కమిటీని ఆభినందించి మాట్లాడారు. ఆర్యవైశ్యులు అంతా ఐక్యమత్యంగా ఉండాలని సూచించారు. నూతన కమిటీని అభినందించారు. అనంతరం పేద మహిళలకు కుట్టుమిషన్లు, నిత్యవసర సరుకుల్ని పంపిణీ చేశారు. అత్యూరి వెంకట నరసయ్య, రామ లీలాకుమారి, బద్రీ, రాజా పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు పెట్రోల్ రాయితీ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో శారీరక వైకల్యం కలిగి ఉండి, సొంత వ్యాపారంగాని, ఏదేని గుర్తింపు పొందిన ప్రయివేటు సంస్థల్లోగాని పని చేస్తూ మూడు చక్రాల మోటారు వాహనం కలిగి ఉన్న విభిన్న ప్రతిభావంతులు పెట్రోలు రాయితీకి దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు దరఖాస్తుదారులు వారు పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతోపాటు వారి సదరం ధ్రువీకరణ పత్రం, పెట్రోల్ కొనుగోలు చేసిన బిల్లులు, బిపిఎల్ రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ, ఆధార్ కార్డు, వ్యాపారం లేదా ప్రయివేటు సంస్థలో పని చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు. జిల్లాలోని అర్హులైన విభిన్న ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు చిన వీరభద్ర రావు

ప్రజాశక్తి - తణుకు రూరల్

భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకి గురికాకుండా ఉండేందుకు నూతన సంవత్సరములో ప్రభుత్వం కార్మికులకు అనుకూలమైన విధానాలు రూపొందించాలని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని కోరారు. వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం సాలిపేటలో యూనియన్ అధ్యక్షులు యర్రా మల్లికార్జునరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా బిల్డింగ్ వర్కర్స్ క్యాలెండర్‌ను వీరభద్రరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఆరు సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికులు ఎన్నడూ లేని విధంగా ఇసుక సమస్యతో ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బంది పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ఇసుక సమస్యను పరిష్కరించి, ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించి బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను పరిష్కరిస్తామని వాగ్దానం చేసిందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు కావస్తున్నప్పటికీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం పట్ల వీరభద్రరావు మండిపడ్డారు. భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయకుండా గత వైసిపి ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే అమలు చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవన నిర్మాణ కార్మికులను ఐక్యం చేసి ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సోరపల్లి రామకృష్ణ, వాటాల నాగేశ్వరరావు, వీరవల్లి వెంకన్న, ముదిగొండ రాముడు, బొక్క బాలాజీరావు, గుడిమెట్ల రాధాకృష్ణ, తాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు



పాండురంగారావును సత్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

విశ్రాంత ఉపాధ్యాయులు పాండురంగారావుకు సత్కారం

ప్రజాశక్తి - మొగల్తూరు


మొగల్తూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో విశ్రాంత ఉపాధ్యాయులు పాండురంగారావును యుటిఎఫ్ నాయకులు ఘనంగా సత్కరించారు. యుటిఎఫ్ 50 వసంతాల స్వర్ణోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విశ్రాంతి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. యుటిఎఫ్ భవన నిర్మాణానికి కీలకపాత్ర వహించారని అన్నారు. మండల కార్యదర్శిగా కూడా ఎనలేని సేవలు అందించాలని కొనియాడారు. వైఎన్ కళాశాలలో పాండురంగారావు అధ్యాపకులుగా కూడా సేవలు అందించారని, ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించారన్నారు. ఆయన 24 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేసి ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కొల్లాటి బ్రహ్మయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చింతపల్లి కృష్ణమోహన్, చింతలపూడి శ్రీనివాస్, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సేవా తత్పరుడు రాము

టిడిపి నాయకులు వెంకటేశ్వరరాజు

ప్రజాశక్తి - ఉండి

సేవా తత్పరుడు తోట శ్రీరాములు అని టిడిపి సీనియర్ నాయకులు పొత్తూరి వెంకటేశ్వరరాజు కొనియాడారు. బుధవారం ఉండి మండలం పాములపర్రు గ్రామంలో సుమారు 100 మంది వృద్ధులకు దుప్పట్లు, పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న పొత్తూరి వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శీతాకాలంలో చలి పులి పెరగడంతో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడం తోట శ్రీరాములకు ఆనవాయితీగా మారిందని గుర్తు చేశారు. ప్రతినెల 100 మంది వృద్ధులకు తన సొమ్మును పింఛన్లుగా పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం తోట శ్రీరాములు మాట్లాడుతూ తనకున్న దానిలో సగం పేద ప్రజలకు సహకారం అందించడానికి ఖర్చు చేసినప్పటికీ తన కుటుంబ సభ్యులు ఎవరూ అడ్డు చెప్పకపోవడం వల్ల గత కొన్ని సంవత్సరాల నుంచి తాను ప్రతినెల పెన్షన్లు పంపిణీ, వస్త్రదానం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలిపారు. తాను ఇచ్చే సొమ్మును వృద్ధులకు మందులు కొనుగోలు చేసేందుకు ఉంటుందనే ఉద్దేశ్యంతో ఇస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఎడవెల్లి వెంకటేశ్వరరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు కేసన యాదగిరి, నాయకులు కేశన బలుసులరావు, నక్క వెంకప్ప, కోమటి నరేంద్ర పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న శ్రీరాములు

స్వీట్స్, బొకేల దుకాణాలు కిటకిట

ప్రజాశక్తి - పెనుమంట్ర

కొత్త సంవత్సరానికి మండలంలోని ప్రజలు ఆనందంగా స్వాగతం పలికారు. బుధవారం స్థానిక దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక ఎంఎల్ఎ, ఎంపిటిసి, జెడ్‌పిటిసి, సర్పంచి వంటి ప్రతినిధులకు, కూటమి పార్టీలోని నాయకులకు పలువురు అభిమానులు, ఉపాధ్యాయులు, సంఘ కార్యకర్తలు, వివిధ శాఖల ఉద్యోగులు స్వీట్ పాకెట్స్, బొకేలు అందించారు. దాంతో మార్టేరు, ఆలమూరు, పెనుమంట్ర, నత్తా రామేశ్వరం సెంటర్‌లలో షాపులు అన్నీ కిటకిటలాడాయి. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు నూతన సంవత్సరం అందరికీ మంచి చేయాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.